బి. శ్రీవల్లీ రాధిక

పడికట్టురాళ్ళు

రైలు వేగంగా పరుగెడుతోంది. మనోజ్ఞ హృదయం అంతకు మించిన ఉద్వేగంతో వూగుతోంది.

"అబ్బో! హైదరాబాద్ ప్రయాణం అంటే ఎంత ఆనందమో చూడు"

"మరి! వెళ్తోంది ఎక్కడికనుకున్నావ్! ఆవిడగారి హీరో దగ్గరికి"

"అయితేమాత్రం! మనోజ్ఞ కూడా అచ్చం ఆడపిల్లలా సిగ్గులమొగ్గ అయితే ఎలా!"

కొలీగ్స్ చేసిన అల్లరి గుర్తొచ్చి మనోజ్ఞ పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

"నిజమే, తను కూడా యింత కదిలిపోతోందేమిటి! రవిని చూడబోతున్నాను అన్న చిన్న ఆలోచనకే యిలా తుళ్ళిపడుతోందేమిటి!?

సిగ్గుపడడం.. బుగ్గలు ఎర్రనవడం.. యిలాంటివి అసలు తనకి చేతకావు అనుకునేవారు అందరూ.

చిన్నప్పటినుంచీ అంతే. "ఆడపిల్లవు. ఒక మూల కూర్చో" అనే ఆంక్షలు తనమీద లేవు.

గోళీలు ఆడేది. కబడ్డీ ఆడేది. గాలిపటాలు ఎగరేసేది.

అక్క.. తను. అంతే. మగపిల్లాడి కోసం అమ్మా వాళ్ళు వెయిట్ చేయలేదు. ఇద్దరూ ఆడపిల్లలేనని వాళ్ళు ఎప్పుడూ బాధపడలేదు.

ఇంట్లో సరుకులు కావాలన్నా, కూరలు కావాలన్నా తనే తెచ్చి పెట్టేది. అక్క చదివినంత బాగా చదవకపోయినా ప్రతిపరీక్షా ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యేది. గేమ్స్ లో మాత్రం తనకి పోటీ ఎవరూ వుండేవారు కాదు స్కూల్లో.. కాలేజ్‌లో కూడా.

గ్రాడ్యుయేషన్ అయిపోగానే ఢిల్లీలో వుద్యోగం వచ్చింది. చదువు.. వుద్యోగం.. వెయిట్‌లిఫ్టర్‌గా నేషనల్ లెవెల్లో గుర్తింపు.."
తను సాధించిన విజయాలన్నీ మనోజ్ఞ మనసులో గిర్రున తిరిగాయి.
వెయిట్ లిఫ్టింగ్‌లో యింట్రస్ట్ చూపించినపుడు చాలామంది నిరుత్సాహపరుస్తూ మాట్లాడారు. ఆడపిల్లకి పనికివచ్చే ఫీల్డ్ కాదన్నారు. ఇపుడు వాళ్ళే నీరాజనాలు పడుతున్నారు.
అక్క మాత్రం మొదటినుంచీ తనని ఎంకరేజ్ చేసింది. అక్క.. తనలాగా కాదు అది. విజయసాధనకి తను శరీరాన్ని ఎలా ఉపయోగించుకుందో అది మేధస్సునలా వుపయోగించుకుంది.
దాన్నీ అంతే. ఆడపిల్లకి యింజినీరింగ్ ఎందుకు అన్నారు. అసలు ఏమిటో ఆ అర్థం లేని మాట! మగపిల్లల్నీ, ఆడపిల్లల్నీ అందర్నీ బీట్ చేసి అది కాలేజ్ ఫస్ట్ వస్తే.. "ఆడపిల్లకి యింజనీరింగ్ ఎందుకు?" అట!
అసలు ఈ అనేవాళ్ళకి బుర్రలుంటాయో వుండవో!
అయితే నాన్నగారు అలాంటి మాటలేమీ పట్టించుకోలేదు.
అందుకే.. యిపుడు నెలకి యిరవైవేలు జీతం.. కారు.. దాని హెూదా దానితోపాటు చదువుకున్న మగపిల్లలు ఎంతమంది సంపాదించారని!
రైలు ఆగుతూండడం గమనించి, కిటికీలోనుంచి తొంగి చూసింది మనోజ్ఞ.
ప్లాట్‌ఫాం మీద నిల్చుని వుంది సంగీత. రైలు దిగి చుట్టూ చూస్తున్న మనోజ్ఞని దగ్గరికి తీసుకుని, రెండు బుగ్గలమీదా ముద్దు పెట్టుకుంది.
"రవి రాలేదులే. పద" అంది సూట్‌కేస్ అందుకుంటూ.
"నేను పట్టుకుంటానులే అక్కా!" సంగీత చేయి తప్పిస్తూ అంది మనోజ్ఞ.
ఆమె గొంతులో ఒక్కసారిగా నీరసం నిండింది.
"ఎప్పుడెప్పుడు చూస్తానా అన్న తపన తనకే గానీ అతనికేం లేదన్నమాట.

ఛ. ఈ మగవాళ్ళింతే." విసుగ్గా అనుకుంది.

"..ఆఫీస్‌లో ఏదో అర్జంట్ మీటింగ్ వుందట. నువు యింటికి వచ్చేసరికి ఫోన్ చేస్తానన్నాడు. వీలైతే రేపు ప్రొద్దున భోజనానికి వస్తానన్నాడు"

సంగీత మాటలు విని నవ్వింది మనోజ్ఞ. తన ఆశాభంగాన్ని కప్పి పుచ్చుకుంటూ "బావగారు ఎలా వున్నారక్కా!" అంది హుషారుగా.

కారు డోర్ తెరుస్తూ సంగీత నవ్వింది. "ఊఁ. ఇంత సేపటికి గుర్తొచ్చారన్నమాట బావగారు" అంది.

ఇంట్లోకి అడుగుపెడ్తూండగానే మాధవ్ ఎదురొచ్చాడు. రెండు చేతులూ సాచి మనోజ్ఞ చేతులు అందుకుంటూ "హలో ఛాంపియన్" అన్నాడు.

"మీరేమిటి బావగారూ! ఇలా బక్కచిక్కిపోయారు!" మనోజ్ఞ ఆటపట్టించింది.

"త్వరగా స్నానం చేసొస్తే భోజనానికి వెళ్దాం"

"ఎక్కడికి!"

"హొటల్‌కి డియర్. ఇవాళ మీ అక్కయ్యగారు లేట్‌గా వేంచేశారు కదా! ఇంట్లో వంట లేదు."

"ఓహో!" అంటూ లోపలికి పరుగెత్తింది మనోజ్ఞ. "ఒక్క నిమిషంలో వస్తాను."

ఆమెకి చాలా ఆనందంగా అనిపించింది ఆ యింటినీ, ఆ వాతావరణాన్నీ చూస్తే. "భార్యా భర్తలిద్దరూ సమానహొదాలో వుండి.. స్నేహితుల్లా ప్రవర్తిస్తుంటే ఎంత బాగుంటుంది!

కాలం చాలా మారింది.

ఏమే! ఒసే అన్న పిలుపులకీ, తలుపు చాటున నిల్చుని "ఏమండీ!" అనడానికీ రోజులు చెల్లిపోయాయి. స్త్రీలు అన్ని రంగాలలోనూ సమానత్వం సాధిస్తున్నారు" సంతోషంగా అనుకుంది మనోజ్ఞ.

హోటల్‌కి వెళ్ళి కూర్చోగానే మళ్ళీ రవి గుర్తొచ్చాడు ఆమెకి.

"కనీసం ఫోన్ కూడా చేయలేదు. రైల్లో వున్నంతసేపూ క్షణాలు లెక్క పెట్టుకుంది. దిగి రెండు గంటలు అయినా దర్శనం కాలేదు" ఆలోచనలు వరదలా చుట్టుకున్నాయి మనోజ్ఞని.

"..పాలక్‌పనీర్.. ఫ్రయిడ్ రైస్.." మాధవ్ ఆర్డర్ చేయడం లీలగా వినిపించింది.

టేబిల్ మీదికి వచ్చిన పదార్థాలని అన్యమనస్కంగా కెలుకుతూ వుండిపోయింది. ఒక్కటీ నోటికి రుచించటం లేదు.

"ఏమిటి? మీ యిద్దరూ అసలేమీ తినడం లేదు" అన్నాడు మాధవ్.

"ఆకలి వేయడం లేదు బావగారూ! " అంది మనోజ్ఞ.

"ఇంకా నయం, అన్నీ వేస్ట్ చేసేస్తారా!" ప్లేట్ చేతిలోకి తీసుకుని వడ్డించబోయాడు మాధవ్.

"బాబోయ్. వద్దు. తినలేను." మనోజ్ఞ పెద్దగా అరిచేసింది. మాధవ్ వులిక్కిపడి వెనక్కి తగ్గాడు.

సంగీత వైపు తిరిగి "నువు తిను" అన్నాడు.

చేయి అడ్డం పెట్టింది సంగీత. "లేదు. తినలేను."

అతను వినిపించుకోలేదు. ఆమె ప్లేట్‌లోకి మూడు పరాటాలు వడ్డించేసి "తిను. సమానత్వం సమానత్వం అంటావు కదా! మరి నేను తిన్నంత తిను నువ్వు కూడా" అన్నాడు.

మనోజ్ఞ నవ్వుతూ అక్క వైపు చూసింది.

సంగీత మొహం తెల్లగా పాలిపోయింది. "నిజంగా తినలేనండీ" అంది దాదాపు ఏడుపు గొంతుతో.

మనోజ్ఞ నివ్వెరపోయి చూసింది. "ఎందుకంత బాధపడుతోంది అక్క! తినలేకపోతే వదిలేయచ్చుగా!" అనుకుంది

కానీ రెండు నిమిషాల తర్వాత అర్థమయింది ఆమెకి సంగీత బాధ. పీకలమీద కూర్చున్నట్లుగా కూర్చుని మొత్తం తినేవరకూ వదిలిపెట్టలేదు మాధవ్.
చిన్నపిల్లలా బలవంతంగా నోటిలో కుక్కుకుంటున్న సంగీతని ఆశ్చర్యంగా చూస్తూండిపోయింది మనోజ్ఞ.
"అదీ.. వెరీగుడ్" అన్నాడు మాధవ్, సంగీత ప్లేట్ ఖాళీ చేయగానె. ఆ మరుక్షణం ఫ్రయిడ్ రైస్ ప్లేట్ అందుకుని ఆమె ప్లేట్‌లోకి సరిగ్గా సగం వడ్డించాడు.
"మిగతా సగం నాకు" అన్నాడు నవ్వుతూ.
నోటికి చేయి అడ్డం పెట్టుకుని వాంతి అవకుండా కంట్రోల్ చేసుకుంటోంది సంగీత. ఆమె కళ్ళల్లో చిన్న నీటి పొర మెరిసినట్లుగా తోచింది మనోజ్ఞకి.
"టూ మచ్" విసుగ్గా అన్నాడు మాధవ్. "మరీ చిన్న పిల్లలా బిహేవ్ చేస్తుంది మీ అక్క. ఇంత కష్టపడుతుంది కదా! సరిగ్గా అన్నం తినకపోతే ఎలా!"
వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో అయోమయంగా చూసింది మనోజ్ఞ.
ఆతర్వాత ఎవరూ మాట్లాడలేదు. ఇంటికి రాగానే పెద్ద వాంతి చేసుకుంది సంగీత. ఆమె మొహం కడిగి, చేయి పట్టుకుని నడిపించుకుని వెళ్ళి, పడుకోబెట్టింది మనోజ్ఞ.
మెడవరకూ దుప్పటి కప్పి, ప్రక్కనే కూర్చుంటూ "ఏమయిందక్కా!" అంది.
సంగీత నీరసంగా నవ్వింది. "ఏమిటో! కొంచెం అనుమానంగా వుంది. రేపు డాక్టర్ దగ్గరికి వెళ్ళాలి."
"హా!" ఆశ్చర్యానందాలతో పెద్దగా అరిచింది మనోజ్ఞ. "అందుకేనా బావగారు "ఇంకా తిను. ఇంకా తిను" అంటూ ముద్దు చేస్తున్నారు!?"
సంగీత మొహం మ్లానమయింది. "ఊహు. అదేం కాదు. మనసు

మారుమూలల్లో.. ఎక్కడో.. ఏమిటీ ఈ ఆడవాళ్ళ గొప్ప! అన్న దుర్గ వుంటుందనుకుంటా. అది ఇలాంటి సమయాల్లో బయటపడుతుంది" అంది.

"అంటే!"

"ఏమిటో మరి!" సంగీత పెదవి విరిచింది. "సమానత్వం అంటే అర్థం కాలేదు కాబోలు వాళ్ళకి. మనం మా యిష్టం వచ్చినది మాయిష్టం వచ్చినంత తింటాం అన్నాము కానీ, వాళ్ళకి యిష్టమయినది వాళ్ళు తిన్నంత తింటాం అనలేదు కదా!" నీరసంగా నవ్వింది.

ఆనవ్వులో వినబడుతున్న అసంతృప్తిని మౌనంగా గమనించింది మనోజ్ఞ. కలలో నడుస్తున్నట్లుగా వచ్చి తన మంచం మీద పడుకుంది.

ఇలా నిద్ర పట్టిందో లేదో "ఏయ్ మను! రవి ఫోన్ చేశాడు, లే." అంటూ లేపింది సంగీత.

పరుగెత్తుకుంటూ వెళ్ళి ఫోన్ అందుకుంది. "..అర్ధరాత్రిపూటా ఫోన్ చేసేది!" బద్ధకంగా అడిగింది.

గలగలా నవ్వాడు రవి. "..పిచ్చి మొద్దూ! అర్ధరాత్రి కాదు. తెల్లవారి చాలాసేపయింది. టైం ఆరున్నర. నువు త్వరగా బయల్దేరి ఎనిమిది గంటలకల్లా మన సంకేతస్థలానికి వస్తే.. యింక అప్పటినుంచీ ఈ దాసుడు నీ అధీనంలో వుంటాడు.. ఈ రోజంతా."

మనోజ్ఞకి హటాత్తుగా తన కోపం గుర్తొచ్చింది. "నేనసలు నీతో మాట్లాడద్దనుకున్నాను." అంది సీరియస్‌గా.

"మాట్లాడకు" ఫోన్ పెట్టేస్తూ అన్నాడు రవి. "వెంటనే బయల్దేరి రా!" ఆమాటలతోపాటూ అలవాటుగా ఓ ముద్దుని ట్రాన్స్‌ఫర్ చేశాయి టెలిఫోన్ తీగలు.

సుడిగాలిలా లేచింది మనోజ్ఞ. అరగంటలో తయారయ్యి హాల్లోకి వచ్చింది.

"టిఫిన్ చేసి వెళ్ళు" సంగీత బలవంతంగా టేబిల్ దగ్గర కూర్చోపెట్టింది.

"ఎలా వెళ్తావు? కారు బావగారు తీసుకువెళ్ళారు."

"లూనా!"

"లూనా బాలేదు."

"బస్‌లో వెళ్తాలే." మాట పూర్తి చేయకముందే బయటకి నడిచింది. బస్‌స్టాప్ వరకూ అదే వేగంతో నడిచింది. ఏం లాభం! అక్కడ ఆగి నిలబడాల్సి వచ్చింది.

అందరూ ఆఫీసులకి వెళ్ళే టైం కాబోలు. బస్‌స్టాండ్ క్రిక్కిరిసినట్లుగా వుంది. తనప్రక్కనే పసిపిల్లని ఎత్తుకుని నిల్చున్న స్త్రీని చూసి పలకరింపుగా నవ్వింది మనోజ్ఞ. ఆమెతో మాటలు మొదలు పెట్టగానే బస్ వచ్చింది.

అంతే. అందర్నీ తోసుకుని, పిల్లతో పాటూ చాలా వేగంగా ముందుకు వెళ్ళింది ఆమె.

అలవాటు లేకపోవడం వల్లనేమో! మనోజ్ఞ వెనకబడింది.

బస్ ఎక్కగానే.. ముందు సీట్లో కూర్చున్న ఆడవాళ్ళని "కొంచెం అడ్జస్ట్ అవుతారా!" అని అడిగింది ఆమె.

"ఎందుకు! వెనక సీట్స్ వున్నాయి కదా!" అంటూ మనోజ్ఞ లోపలికి నడిచింది.

"ఇది లేడీస్ సీట్. లేస్తారా!" అంది అందులో కూర్చున్న మగవాళ్ళని వుద్దేశించి.

వాళ్ళు వినిపించనట్లుగా చూశారు ఒక్కక్షణం.

మనోజ్ఞ మళ్ళీ అడగడంతో అప్పుడు తలత్రిప్పారు. ఇంకో రెండు వరుసల తర్వాత రెండో వైపుకి వున్న సీట్ చూపిస్తూ "అక్కడ ఒక్కడే వున్నాడు. ఆయన్ని లేపండి." అన్నారు.

వాళ్ళ మాటలు వింటూనే ఆ సీట్లో వున్న అతను టకీమని లేచాడు. అదేదో విశ్వమంతా ఆమోదించిన న్యాయం లాగా.

మనోజ్ఞ ఆశ్చర్యంగా అటువైపు చూసింది. వెంటనే ఆమెకు కారణం అర్థమయింది.

అటువైపు విపరీతంగా ఎండ పడ్తోంది. ఆ సీట్లో అతని ప్రక్కన చిన్నపాప కూర్చునివుంది.. స్కూల్‌డ్రస్‌లో. ఆ పాప మొహం ఎర్రగా కందిపోయి వుంది.

" సో.. నిల్చోడానికీ.. ఆ సీట్లో కూర్చోడానికీ పెద్దగా తేడా లేదన్నమాట. అందుకే అతను అలా చెంగున లేచి నిలబడ్డాడు.

లేకపోతే.. ఆ సీట్ కూడా దీనిలాగా సౌఖ్యంగా వుండి వుంటే.. తను మధ్యలో వున్న వాళ్ళందరినీ తోసుకుని.. కదిలే బస్‌లో ఉయ్యాలలూగుతూ అక్కడిదాకా వెళ్ళాక.. "ముందు సీట్లో వాళ్ళని లేపకుండా వెనక్కి వచ్చి అడుగుతారేంటండీ! " అనేవాడేమో!

ముందు సీట్లో వాడు ముందు లేవాలా! ఒక్కడే కూర్చున్న వాడు ముందు లేవాలా! అన్న మీమాంసతో తనను బస్‌లో అటూ యిటూ తిప్పుతూ గమ్యస్థానం చేర్చేవారన్నమాట. "

మనోజ్ఞకి వళ్ళు మండిపోయింది. ఇదీ లేడీస్ సీటే. అదీ లేడీస్ సీటే. ఈ రెండింటిలో ఎక్కడయినా కూర్చోగలిగిన హక్కు తనకి వుంది. తను అడగగానే లేవవలసిన విధి వాళ్ళకి వుంది.

ఏ సీట్ అయినా అడిగే హక్కు తనకి వున్నపుడు, ఆ ఛాయిస్ ని వుపయోగించుకోవలసింది తనా! వాళ్ళా! ఒక్క అయిదు నిమిషాలు ఆ సీట్లో కూర్చున్నా తనకి తలనొప్పి రావడం ఖాయం. ఇటువైపు ఖాళీ లేకపోతే వేరే విషయం. ఉన్నప్పుడు తను అక్కడికి ఎందుకు వెళ్ళాలి?

"నేను ఇక్కడే కూర్చోవాలి. మీరు లేవండి." స్పష్టంగా చెప్పింది మనోజ్ఞ.

వాళ్ళు వీసమెత్తు కూడా విలువ యివ్వలేదు ఆమె మాటకి.

"మేము లేవం. ఎవడితో చెప్పుకుంటావో చెప్పుకో పో." అన్నారు.

వాళ్ళొక్కళ్ళే కాదు. బస్‌లో అందరూ.. కండక్టర్‌తో సహా మనోజ్ఞదే తప్పు అన్నట్లుగా చూశారు.

ఒక స్త్రీ అయి వుండి ఆమె అంత పంతం పట్టడం వాళ్ళకి నచ్చలేదు. "ఖాళీగా వున్న సీట్లో నోరు మూసుకుని కూర్చోక మగవాళ్ళమీద అథారిటీ ఏమిటి?" అన్న ఎక్స్‌ప్రెషన్ ప్రతి ఒక్కరి కళ్ళలోనూ కనపడింది.

అంతలో.. ముందు సీట్లో కూర్చున్న ఆవిడ తన స్టాప్ రావడంతో లేచి నిలబడింది.

అంతే. పదిమంది ముక్త కంఠంతో చెప్పారు. "అదిగో. ఆ సీటు ఖాళీ అయింది. కూర్చోండి."

తప్పలేదు మనోజ్ఞకి. కూర్చుంది కానీ ఆమె గుండెల్లో సన్నటి మంటలాగా అనిపించింది. తనలాంటి స్త్రీ కూడా వుపయోగించుకోలేని హక్కులు వుండి లాభమేముంది!

పసిపిల్లలతో ఎండలో మాడిపోతూ కూర్చున్న ఆడవాళ్ళని చూస్తే జాలేసింది మనోజ్ఞకి. ఒక్కరు కూడా యిటువైపు వున్న లేడీస్ సీట్‌ని అడిగే ప్రయత్నం చేయలేదు!

ఆమె బాధ గ్రహించినట్లుగా ప్రక్కన కూర్చున్న ఆవిడ నవ్వింది. "వాళ్ళు అంతేనండీ. ఇంకా నయం. ఇవాళ అసలు ఏదో ఒక సీటు వుంది. అసలు సీటే లేకపోయినా మనం అడగగానే వాళ్ళు లేవరు. ఆడవాళ్ళు వచ్చి "లే" అంటే లేవడానికి పౌరుషం అడ్డురాదూ మరి!

ఎందుకొచ్చిన బాధ అసలు లేడీస్ సీట్లో కూర్చోకుండా వుందాం అనుకోరు. కూర్చుంటారు. లేవమని అడిగితే రోషాలు పోతారు."

సన్నటి గొంతుతో ఆవిడ చెప్తుంటే మనోజ్ఞ ఆశ్చర్యంగా వింది. ఆమెకి సంగీత గుర్తొచ్చింది.

పరాయి మగవాళ్ళ పెత్తనాన్నే సహించక తప్పని పరిస్థితి సమాజంలో

వున్నపుడు, భర్త అధికారాన్ని, అహంకారాన్ని భరించడం దోషం కాదేమో!
వెనక కూర్చున్న వాళ్ళు యింకా సణుగుతూనే వున్నారు. "సమానత్వం, సమానత్వం అంటారు. మళ్ళీ ప్రత్యేక హక్కులు కావాలి వీళ్ళకి. కాసేపు బస్‌లో నిల్చోలేరు కానీ మగవాళ్ళతో సమానం అని ఏడుస్తారు...."
నిట్టూర్పుని అణచుకుంటూ మనోజ్ఞ బస్ దిగింది.
"వీళ్ళతో సమానత్వం కోరుకునే దౌర్భాగ్యంలో వుందా తను! నిజంగా అందుకోసమే పోరాడుతోందా స్త్రీజాతి!!"
వడలిపోయిన మొహాన్ని.. ఆలోచనలతో ముడుచుకున్న భృకుటిని ఆశ్చర్యంగా చూశాడు రవి.
"ఏమయింది!" అన్నాడు చేయందుకుంటూ.
"ఏంలేదులే"
"అరే. చెప్పవోయ్." అతను రెట్టించాడు.
"ఏం లేదు." మరింత చికాకుగా చెప్పింది మనోజ్ఞ. "అసలు మీ మగవాళ్ళని ఎలా సృష్టించాడో ఏమిటో దేవుడు!" ఉక్రోషంతో ఆమె పెదవులు వణికాయి.
రవి బిక్కమొహం పెట్టాడు. "నేనేం చేశాను!" అన్నాడు చిన్న పిల్లాడిలా పెదవులు ముడుస్తూ.
మనోజ్ఞ చికాకంతా ఒక్కసారిగా ఎగిరిపోయింది. ఫక్కున నవ్వేస్తూ, అతని భుజాన్ని తన తలతో చిన్నగా కొట్టింది.
రిలీఫ్‌గా చేతులు ఎగరేసి బైక్ స్టార్ట్ చేశాడు రవి. "కాళ్ళు అటూ యిటూ వేసి కూర్చో" అన్నాడు దగ్గరగా వస్తున్న మనోజ్ఞతో.
"అబ్బ, యిలా కూర్చుంటాలే బాబూ!" ప్రక్కనుంచి ఎక్కుతూ ఆమె సమాధానం చెప్పింది.
"నో. అలా కూర్చునేట్లయితేనే తీసుకెళ్తాను. నడుము చుట్టూ చేతులు వేసి గట్టిగా పట్టుకో." రవి మారాం చేశాడు.

చెప్పినట్లు వినక తప్పలేదు మనోజ్ఞకి. గాలితో పోటీ పడుతూ వెళ్తున్న బైక్ మీద అతని వీపుకి మొహాన్ని ఆన్చి కళ్ళు మూసుకుంది.

తన తలమీది కాప్‌ని ఆమె తల మీదికి ట్రాన్స్‌ఫర్ చేస్తూ.. "ఏం ఆడవాళ్ళో ఏమిటో! అన్నిట్లో మగవాళ్ళతో సమానం అంటారుగా! మళ్ళీ యిలా కూర్చోమంటే సిగ్గు పడతారేం!" అన్నాడు.

ఛర్రున చూసింది మనోజ్ఞ ఆమాటలకి. "నాకేం సిగ్గు లేదు" అంది కొట్టినట్లుగా.

రవి పెద్దగా నవ్వాడు. "నాకు తెలుసు" అన్నాడు అల్లరిగా. "నీ సంగతి కాదులే నేనిప్పుడు చెప్పింది."

ఆమెకి కూడా నవ్వొచ్చింది. పిడికిలితో అతని వీపు మీద గట్టిగా కొడుతూ "పో. నేనసలు నీతో మాట్లాడను." అంది.

ఆతర్వాత రెండు చేతులూ అతని నడుము చుట్టూ మరికాస్త బిగించి, మొహాన్ని అతని వీపులో దూర్చేసుకుని కళ్ళు మూసుకుంది.

అలా ఎంత దూరం ప్రయాణించినా తనివి తీరదు ఆమెకి. బైక్ ఆగగానే అసంతృప్తిగా క్రిందికి దిగింది.

"ఎక్కడికొచ్చాం?"

"పద చెప్తాను." గేటు తీసుకుని లోపలికి నడిచాడు రవి.

చాలా పెద్ద కాంపౌండ్. చుట్టూ పెద్ద తోట. ఆ తోట మధ్యలో చిన్న ఇల్లు. గేటు మెయిన్ రోడ్ మీదికే వున్నా.. ట్రాఫిక్ రొద యింటిదాకా రావడం లేదు. చాలా ప్రశాంతంగా, నిర్మానుష్యంగా వుంది.

తోటలో పచ్చగడ్డి మీద కూర్చుంటూ చెప్పాడు రవి "రా. కూర్చో."

"ఏమిటిది!" అంది మనోజ్ఞ ఆశ్చర్యంగా చూస్తూ.

"మాఫ్రెండ్ యిల్లు యిది. ఎపుడూ ఖాళీగానే వుంటుంది. ఇవాళ నీతో గడపడానికి ఒక క్రొత్త ప్లేస్ కావాలనిపించింది. కీస్ తీసుకున్నాను. ఈ

కథా నిలయం
4718
శ్రీకాకుళం

తోట.. ఈ యిల్లూ యిదంతా నాకు చాలా యిష్టం." చుట్టూ చూస్తూ చెప్పాడు రవి.

"అవును. చాలా బాగుంది." అంది మనోజ్ఞ.

ఆమెకి కూడా చాలా నచ్చింది ఆ వాతావరణం. తోటలో దూరంగా పని చేసుకుంటున్న ముసలి నౌకరు తప్ప మరెవరూ లేరు అక్కడ.

పూలూ.. మొక్కలూ.. రంగులూ.. పరిమళాలూ.. వసంతుడు తామిద్దరికోసమే సృష్టించిన స్వర్గంలా వుంది.

గంట.. రెండు గంటలు.. మూడు.. నాలుగు గంటలు నిమిషాల్లా గడిచిపోయాయి.

తన వడిలో తలపెట్టుకుని, తన చేతులు రెండూ అతని చెంపలకి ఆనించుకుని కబుర్లు చెప్తున్న రవిని చూసి చిన్నగా నవ్వింది మనోజ్ఞ.

"ఏంటి! ఇంక మనం యిక్కడేనా యివాళ!" అంది.

రవి లేచి కూర్చున్నాడు. "అన్నం తిందామా!" అంటూ లోపలికి నడిచాడు.

నౌకరు భోజనం పెట్టడం.. వేడి వేడిగా తినడం.. అంతవరకూ బాగానే గడిచింది.

ఆతర్వాత.. సీరియస్‌గా బెడ్‌రూంలోకి నడిచాడు రవి. తలుపులు చేరవేసి మనోజ్ఞని దగ్గరికి తీసుకున్నాడు.

"ఇదేమిటి!"

"భోజనం తర్వాత ప్రోగ్రామ్." గుసగుసగా చెప్పాడు.

"చాల్లే వూరుకో." ఒక్క చేత్తో అవతలికి తోసింది మనోజ్ఞ.

ఆ విసురుకి మంచం మీద వెల్లకిలా పడ్డాడు రవి. "మనూ.. ప్లీజ్" ఆమె చున్నీని చేత్తో లాగేస్తూ అర్థించాడు.

"అలాంటి పిచ్చి ఆలోచనలేం చేయకు. నాకు నచ్చదు. ఏమన్నా కబుర్లు

చెప్పు." అతని ప్రక్కనే కూర్చుంటూ అంది మనోజ్ఞ.

"ఏం చెప్పను.." రవి బుంగమూతి పెట్టాడు. ఆమె నడుము మీద చూపుడువేలితో రాస్తూ.. "వీణ వాయించడం నేర్చుకున్నానీ మధ్య. చూపించనా!" అన్నాడు.

"వద్దు" అతని చేయి తీసి ప్రక్కన పెట్టింది.

"పోనీ గిటార్!"

ఫక్కున నవ్వింది మనోజ్ఞ. అతని తలని రెండు చేతులతో వూపుతూ "ఏంటి రవీ ఈ అల్లరి!" అంది.

"మనూ.. ప్లీజ్." మళ్ళీ బ్రతిమలాట మొదలుపెట్టాడు రవి. "..ఎలాగూ వచ్చే నెలలో పెళ్ళి చేసుకోబోతున్నాం."

మొహం చిట్లించింది మనోజ్ఞ. "అదే మరి! ఎలాగూ పెళ్ళి చేసుకోబోతూ తొందరపడడం ఎందుకు?"

ఆమె అంత ఖచ్చితంగా చెప్పడంతో రవికి కోపం వచ్చింది.

తన కోరికలోని అన్యాయమూ.. ఆమె యిష్టాయిష్టాల ప్రమేయమూ.. వీటిల్తో అతనికి నిమిత్తం లేదు.

"తను అంత ముద్దుగా.. అంత అందంగా బ్రతిమలాడుతున్నా ఆమె ఒప్పుకోవడంలేదు" అన్న ఒకే ఒక్క కారణంతో అతనికి కోపం వచ్చింది.

"ఛీ. నువ్వు కూడా యిలాగే మాట్లాడ్తావనుకోలేదు." అన్నాడు.

మనోజ్ఞ దెబ్బ తిన్నట్లుగా చూసింది "నేను కూడానా.. అంటే..!" అంది.

తన ఆశాభంగాన్ని మనోజ్ఞ కళ్ళలోని బాధతో కాంపన్సేట్ చేసుకుంటూ రవి రిపీట్ చేశాడు. "ఎన్నో సాధించానంటావుగా! నేనూ మగవాడితో సమానం అంటావుగా! నువ్వు కూడా యిలాంటి సెంటిమెంట్స్ పట్టుకుని వేళ్ళాడతావనుకోలేదు. మాటల్లోనే సమానత్వం.. ఆలోచనల్లో కాదు."

చాలా పరుషంగా దూసుకు వచ్చిన ఆ మాటలకి మనోజ్ఞ బిత్తరపోయింది.

గుండెల్లో దుఃఖం సుళ్ళు తిరిగింది. మరుక్షణం పెద్దపెట్టున నవ్వొచ్చింది. "నిజమే. మీతో సమానంగా తిండి తినలేం. మీతో సమానంగా బస్‌లో నిల్చోలేం. మీతో సమానంగా సెంటిమెంట్స్‌ని వదిలేసి అనుభూతులు లేని అనుభవాలని జీవితం పుస్తకంలోకి ఎక్కించలేం.. ఇంక అసలు ఎందుకు పనికొస్తాం మేము!" అంది.

ఆమె వాగ్ధాటికి రవి బిత్తరపోయాడు. "అదేమిటి!" అన్నాడు అయోమయంగా.

మనోజ్ఞ లేచి నిలబడింది. చున్నీ అందుకుని గుండెలమీద సర్దుకుంటూ చెప్పింది.

"చూడు రవీ! నీకొక వ్యక్తిత్వం వుంది. నాకూ ఒక వ్యక్తిత్వం వుంది. కానీ దురదృష్టవశాత్తూ.. నీ కోరిక తీరిస్తే.. నువు అనుభవించిన వాడివి.. నేను అనుభవింపబడినదాన్ని అన్న ఫీలింగ్.. అది మనిద్దరిలోనూ వుంటుంది. ఇక అది సమానత్వమెలా అవుతుంది?" చిన్నగా నవ్వింది.

"ఆ ఫీలింగ్‌ని నువ్వు జయించినపుడు.. లేదు కనీసం నేను జయించినపుడు.. నాకేం అభ్యంతరం వుండదు. ప్రస్తుతానికి నన్ను క్షమించు."

అతనికి అర్థం అయేలోపూ గాలికెరటంలా ఆమె కదలి వెళ్ళిపోయింది.

అతను ఆమె వెనుక నిర్విణ్ణుడై నిలబడ్డాడు.

*****

("వినూత్న కథ" కథాసంపుటి - 1996)